జంక్షన్లలో టెన్షన్..!

- అలంకారప్రాయంగా సిగ్నల్ లైట్లు
- నిత్యం వాహనాలతో రద్దీగా బీఆర్‌టీఎస్
- ప్రమాదాలు జరుగుతున్నా చోద్యం చూస్తున్న అధికారులు


బీఆర్‌టీఎస్‌లో ఇటీవల ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్

కంచరపాలెం : ప్రజాధనంతో, ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన ట్రాఫిక్ నియంత్రణ సిగ్నల్ లైట్లు అలంకారప్రాయంగా మారడంతో కీలక జంక్షన్లలో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ఫలితంగా వాహనదారులు, పాదచారులు కూడళ్ల వద్ద తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారుల నుంచి లక్షలాది రూపాయలు అపరాధ రుసుము పేరుతో వసూలు చేస్తున్నప్పటికీ వారి భద్రత కోసం కనీస చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం కంచరపాలెం కూడలి నుంచి మర్రిపాలెంకు వెళ్లే బీఆర్‌టీఎస్ మార్గంలో ఏర్పాటు చేసిన సిగ్నల్ లైట్లు పనిచేయడం లేదు. వాటిని ఇప్పటి వరకు వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అలంకారప్రాయంగా ఉన్నాయి. గతంలో కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, 104 ఏరియా, మర్రిపాలెం, కరాసా ప్రాంతాల్లో సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేశారు. అనంతరం అవి పనిచేయకున్నా... మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేశారు. పలుమార్లు ట్రాఫిక్ విభాగ అధికారులకు విన్నవించినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు.

ట్రాఫిక్ రద్దీ విపరీతం

కంచరపాలెం నేతాజీ ఫ్లై ఓవర్ వంతెన కూడలి, ఊర్వశి కూడలి జాతీయ రహదారికి వెళ్లే కూడలి మార్గం, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా నుంచి నేవల్, రైల్వే ప్రాంతాలకు వెళ్లే కూడలి (జ్ఞానాపురం రైల్వే స్టేషన్ కూడలి, చావులమదుం, కాన్వెంటు కూడలి నుంచి గాజువాకకు వెళ్లే రహదారి) ప్రాంతాల్లో రోజు రోజుకీ ట్రాఫిక్ పెరిగిపోతోంది. మూడు, నాలుగు వైపుల నుంచి వాహనదారులు వేగంగా వస్తుండడం ... ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉదయం, సాయంత్రం సమయంలో రద్దీ ఎక్కువగా ఉండడంతో వాహనాలు నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొద్ది రోజుల కిందట ఊర్వశి కూడలి ప్రాంతంలో ఓ ఆటో నిలిపేయడంతో... ట్రాఫిక్‌కు భారీ అంతరాయం కలిగింది. దీంతో అటుగా వెళ్లే అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. తక్షణమే అధికారులు స్పందించి సిగ్నల్ లైట్లు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


బీఆర్‌టీఎస్‌లో పనిచేయని సిగ్నల్ లైట్లు


ఇష్టారాజ్యంగా రోడ్డుపై నిలిపిన ఆటోలు

కూడళ్లలో ఎన్నో ప్రమాదాలు

ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేసినప్పటికీ వినియోగంలోకి తీసుకురాకపోవడంతో పలు కూడళ్లలో ఇప్పటి వరకూ సుమారు 60 ప్రమాదాలు సంభవించాయి. నిత్యం ఏదో ఒక జంక్షన్‌లో ప్రమాదం సంభవిస్తూనే ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. సిగ్నల్ లైట్లు ఉన్నప్పటికీ వాటిని వినియోగంలోకి తీసుకురాకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. వాటిని వినియోగంలోకి తీసుకొస్తే ప్రమాదాలు నియంత్రించేందుకు అవకాశం ఉండేదంటున్నారు.


కంచరపాలెం కూడలికి వెళ్లే సబ్ వేలో సాయంత్రం సమయంలో ట్రాఫిక్ పరిస్థితి ఇదీ

అధికారులు స్పందించడం లేదు

బీఆర్‌టీఎస్ రహదారుల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ అలంకారప్రాయంగా కనిపిస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులు వాహనాల నియంత్రణను గాలికొదిలేయడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పాదచారుల కోసం జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేసినా వాహనాల రద్దీతో వారు వినియోగించుకోలేకపోతున్నారు. కూడళ్లో ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదు.

– వేద సాయికృష్ణ, జ్ఞానాపురం

నిత్యం ట్రాఫిక్ జామ్

బీఆర్‌టీఎస్ రహదారి అసంపూర్తిగా వదిలేయడంతో వాహనాల రాకపోకల సమయంలో ట్రాఫిక్ నిలిచిపోతోంది. సబ్‌వే రహదారిలో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేయడంతో ద్విచక్ర వాహనాలు రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారు. వాహనాలు అడ్డదిడ్డంగా పెట్టడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వాహనదారులు విధులకు వెళ్లే హడావిడిలో ట్రాఫిక్ జఠిలం అవుతోంది. బీఆర్‌టీఎస్ రహదారి, ట్రాఫిక్ లైట్లు వినియోగంలోకి తీసుకురావాలి.

– కె.కీర్తి, స్థానికురాలు, ఊర్వశి కూడలి

ట్రాఫిక్ సిబ్బందిని పెంచాలి

బీఆర్‌టీఎస్ రహదారి కూడల్లో ట్రాఫిక్ పోలీసులు అంతంత మాత్రంగానే కనిపిస్తున్నారు. పండగ సమయాల్లోనూ, పత్రికల్లో వార్త కనిపించేటప్పుడు మాత్రమే ట్రాఫిక్ పోలీసుల జాడ కనిపిస్తోంది. మిగతా రోజుల్లో షరా మామూలుగానే ఉంటోంది. ఉన్నతాధికారులు పర్యవేక్షించి, ఉదయం సాయంత్రం వేళల్లో ఎక్కువ మంది సిబ్బంది విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలి. సిగ్నల్ లైట్లు వినియోగంలోకి తీసుకురావాలి.

– ఎం.జశ్వంత్, కంచరపాలెం

మాజీ సీఎం జగన్‌తో జాన్‌వెస్లీ భేటీ


మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో జాన్‌వెస్లీ, సర్వేశ్వరరెడ్డి, తదితరులు

సీతమ్మధార : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలో గల క్యాంపు ఆఫీస్‌లో పార్టీ నాయకులు గురువారం కలిశారు. క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ ఆధ్వర్యంలో పార్టీ జీవీఎంసీ 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, 35వ వార్డు అధ్యక్షుడు ఎ.కనకరెడ్డి, కళింగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ససపల రవీంద్రభరత్, సోషల్ మీడియా ప్రతినిధి బేవర మహేష్, 33వ వార్డు అధ్యక్షుడు ముత్తబత్తుల రమేష్ కలిశారు. ఈ సందర్భంగా నీలాపు సర్వేశ్వరరెడ్డి చేతిపై తన ఫొటో పచ్చబొట్టుగా వేయించుకోవడం చూసి జగన్‌మోహన్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.

జ్వాలా తోరణ మహోత్సవం నేడు

సీతంపేట : కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి 7 గంటలకు దేవదాయ శాఖ పరిధిలో గల శివాలయాల్లో జ్వాలాతోరణ మహోత్సవం నిర్వహించనున్నట్టు ఈవో రమాభాయి తెలిపారు. స్థానిక సీతంపేటలో గల పార్వతీశ్వరాలయంలో, శంకరమఠం రోడ్, రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయంలో శుక్రవారం రాత్రి 7 గంటలకు జ్వాలా తోరణ మహోత్సవం నిర్వహిస్తామని... అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ముందు పార్వతీ పరమేశ్వరులు, రామలింగేశ్వరస్వామి తిరువీధి మహోత్సవం, పల్లకీ సేవ నిర్వహిస్తామని తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

క్లుప్తంగా

వైభవునికి పంచామృతాభిషేకం నేడు


వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఆర్జిత సేవలో పాల్గొనే దాతలు, భక్తులు మంగళధ్వని, వేద మంత్రోచ్చరణ మధ్య అభిషేక ప్రదక్షిణ చేస్తారని తెలిపారు. అనంతరం స్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, ఫలరసాలు, పసుపు, కుంకుమ, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో పంచామృతాభిషేకం చేస్తారని తెలిపారు.

బాలల హక్కులపై ప్రచార పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డిప్యూటీ లేబర్ కమిషనర్ సునీత, తదితరులు

సీతంపేట : బాలల హక్కుల వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్నందున బాలల హక్కులపై రూపొందించిన ప్రచార పోస్టర్లు అక్కయ్యపాలెం లేబర్ ఆఫీస్‌లో డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎం.సునీత గురువారం ఆవిష్కరించారు. బాలలతో పని చేయించరాదు, బాల్య వివాహాలు నేరం, బాల కార్మికులను, బాల్య వివాహ బాధితులను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు ప్రవేశ పెట్టాలనే సమాచారం పోస్టర్‌లో పొందుపరిచారు. కార్యక్రమంలో విశాఖ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ ప్రతినిధులు, ధరణి సంస్థ ప్రతినిధులు, ఏయూ సోషల్ వర్క్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ వారం రోజులు నగరంలోని స్కూళ్లు, మురికివాడల్లో ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని విశాఖ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ కార్యదర్శి బి.హరి తెలిపారు.

వైన్‌షాపు తక్షణమే తరలించాలి


మద్యం షాపు ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

మర్రిపాలెం : జనావాసాల మధ్య నిర్వహిస్తున్న వైన్‌షాపును తక్షణమే వేరే ప్రాంతానికి తరలించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ 51వ వార్డు మాధవధార మెయిన్ రోడ్డు 48ఏ బస్టాప్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వెంటనే తరలించాలని ధర్నా చేశారు. స్థానికులు అటుగా వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారని, షాపు తరలించకపోతే పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నివాసాల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. సీపీఎం నాయకుడు సత్యనారాయణ, డీవైఎఫ్ఐ నాయకుడు శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న వెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం : ఇటీవల విజయవాడ వరద ప్రభావ ప్రాంతాల్లో సేవలు అందించడానికి వెళ్లి తిరిగొచ్చిన జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం సమకూర్చిన దుస్తులను 51వ వార్డు కార్పొరేటర్ వెయ్యి వెంకటరమణ గురువారం పంపిణీ చేశారు. అనంతరం వారిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ హేమంత్, సచివాలయ శానిటరీ సెక్రటరీలు శ్రీను, గంగరాజు, సూపర్‌వైజర్లు గణేష్, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన


క్విజ్ పోటీల విజేతలతో రాణి శర్మ, ప్రసన్నకుమార్, డీఎస్ శర్మ, తదితరులు

సీతంపేట : పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన సాధ్యమని, ప్రతి ఒక్కరూ పఠనం అలవాటు చేసుకోవాలని చరిత్ర పరిశోధకులు, రచయిత్రి రాణిశర్మ సూచించారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లిపి పుట్టుక, తాళపత్రాల నుంచి పుస్తక ఆవిర్భావం వరకు జరిగిన క్రమాన్ని, అందుకోసం మహాత్ముల కృషిని వివరించారు. విశాఖపట్నం పౌరగ్రంథాలయంలో మంచి సదుపాయాలతో ఆహ్లాదకర వాతావరణం ఉందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. అనంతరం స్టోరీ టెల్లింగ్ నిపుణులు యం.సీత శ్రీనివాస్, ఆర్.వరలక్ష్మి, శ్రీకరుణను ఘనంగా సన్మానించారు. క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఆచార్య ఎ.ప్రసన్నకుమార్, గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ, సంయుక్త కార్యదర్శి డి.వి.సూర్యారావు, గ్రంథపాలకులు దుర్గా రాణి, సిబ్బంది పాల్గొన్నారు.


నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పెద్దినాయుడు, దత్తి అప్పలనాయుడు

మురళీనగర్ : విద్యార్థులు పుస్తక పఠనానికి ప్రాధాన్యమివ్వాలని మాధవధార జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్దినాయుడు సూచించారు. మురళీనగర్ మహిళలు, పిల్లల గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలను వినియోగించుకోవాలన్నారు. ఇష్టమైన పుస్తకాలు ఇక్కడ లభిస్తాయని, వాటిని చదవడం ద్వారా సృజనాత్మకతను పెంపొందించుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గ్రంథాలయ ఉద్యమకారుడు దత్తి అప్పలనాయుడు భారత దేశ తొలి ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి బాలల దినోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ వై.పద్మజ, పాఠకులు పాల్గొన్నారు.

సాయిబాబా గుడిలో అన్నదానం

సీతమ్మధార : స్థానిక నార్త్ ఎక్స్‌టెన్సన్‌లో గల శ్రీ మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, శ్రీ షిరిడీ సాయిబాబా దేవస్థానంలో గురువారం అన్నదానం చేశారు. భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాదం వడ్డించారు. అంతకు ముందు ప్రధాన అర్చకులు రాజాస్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు. ప్రతి గురువారం ఉదయం 11 గంటల నుంచి భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్‌బాబు, సిబ్బంది శివ, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలకు అన్నదానం

సీతంపేట: బాలల దినోత్సవం సందర్భంగా గౌరీ సంక్షేమ సేవా సంఘం(మురళీనగర్), గౌరీ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో అక్కయ్యపాలెంలోని పావని హ్యాండీక్యాప్డ్ ఇనిస్టిట్యూట్‌లో 80 మంది పిల్లలకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా రామకృష్ణ, కాళ్ల వెంకటప్రసాద్, కోశాధికారి వేగి సత్యనారాయణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

సీతమ్మధార : ద్విచక్ర వాహనం వెనుక వైపు కూర్చున్న వృద్ధురాలు ప్రమాదవశాత్తూ రోడ్డుపై పడిపోవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ద్వారకా జోన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయనగరం జిల్లాకు చెందిన కమలా మారమ్మ (60) అనారోగ్యం కారణంగా చికిత్స నిమిత్తం విశాఖ నగరంలోని కుమారుడి ఇంటికి వెళ్లేందుకు మద్దిలపాలెంలో బస్సు దిగారు. అక్కడి నుంచి సీతమ్మధార హిల్ వ్యూ ప్రాంతంలో గల ఇంటికి వెళ్లేందుకు కుమారుడి ద్విచక్ర వాహనం ఎక్కారు. మార్గ మధ్యలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలో ప్రమాదవశత్తూ రోడ్డుపై మారమ్మ పడిపోయారు. దీంతో ఆమె తలకు బలమైన గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించారు. ద్వారకా స్టేషన్ ఏఎస్ఐ ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేశాభివృద్ధికి బాటలు వేసిన మహనీయుడు నెహ్రూ

మురళీనగర్ : దేశాభివృద్ధికి బాటలు వేసిన మహనీయుడు జవహర్‌లాల్ నెహ్రూ అని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అన్నారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం వాకర్స్ క్లబ్ పార్క్ ప్రాంగణంలో నెహ్రూ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెహ్రూ అమలు చేసిన సంస్కరణలను వివరించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి చంద్రమౌళి, పూర్వ అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య, కేజీ కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ బాలల దినోత్సవం, ప్రపంచ మధుమేహ నివారణ దినం, తొలి భారతీయ టెస్ట్ క్రికెట్ కెప్టెన్ కల్నల్ సి.కె.నాయుడు వర్ధంతి, ఇస్కాన్ వ్యవస్థాపకులు శీల ప్రభుపాద వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వాధ్యక్షుడు కె.ద్వారకానాథ్, కార్యదర్శి పి.చెల్వరాజు, సబ్బినేని రామ్మోహనరావు, కార్యవర్గ సభ్యులు చొల్లంగి ప్రసాద్, ఎన్.ప్రకాశరావు, రోణంకి నాగేశ్వరరావు పాల్గొన్నారు.


నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

బాలలను ఉన్నతంగా పెంచడం అందరి బాధ్యత


డ్రాయింగ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు


వాల్తేర్ కేవీలో బాలల దినోత్సవంలో చిన్నారులతో ప్రిన్సిపాల్ కమల్‌జీత్, వీఎం శైలజ, తదితరులు

తాటిచెట్లపాలెం : నేటి బాలలే రేపటి పౌరులని, వారిని ఉన్నతంగా పెంచాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని కేంద్రీయ విద్యాలయం వాల్తేర్ బ్రాంచి ప్రిన్సిపాల్ కమల్‌జీత్ అన్నారు. ఈతరం పిల్లలను పెంచే విషయంలో తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తాటిచెట్లపాలెం జాతీయ రహదారి సమీపంలో గల విద్యాలయంలో బాలల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రైమరీ స్కూల్ చిన్నారులు విచిత్ర వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమాల్లో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వీఎం శైలజ, విజయలక్ష్మి, వాణి, సోమేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : జీవీఎంసీ 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలో గల జీవీఎంసీ ఉర్దూ యూపీ స్కూల్‌లో బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్, డ్యాన్స్, పాటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం శాంతికుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతమ్మధార : స్థానిక ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పీ అండ్ టీ కాలనీలో గల వసంత బాల విద్యాలయంలో బాలల దినోత్సవంలో బీజేపీ నాయకురాలు శ్యామలాదీపిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో కొంతసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో ద్వారకా స్టేషన్ క్రైం సీఐ బంగారుపాప, తదితరులు పాల్గొన్నారు. ఎస్ఎంసీ హైస్కూల్‌లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం డి.రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.


ఎస్ఎఫ్ఎస్ స్కూలులో విచిత్ర వేషధారణలో విద్యార్థులు

సీతంపేట : స్థానిక మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో బాలల దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు, డ్రాయింగ్, పాటలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు, చక్కగా యూనిఫాం వేసుకున్న విద్యార్థులకు, ఉత్తమ హాజరు కలిగిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శాంతికుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అక్కయ్యపాలెం ఎన్జీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌లో బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- అక్కయ్యపాలెం వాగ్దేవి పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ ముఖ్య అతిథిగా విచ్చేసి నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలు రేపటి అత్యున్నత మేధావులుగా ఎదగాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.వి.వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఎస్.ఎల్.శైలజ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు సంస్కారాన్ని, దేశభక్తిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. సాంస్కృతిక పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.


వసంతబాల పాఠశాలలో విద్యార్థులతో శ్యామలాదీపిక

- సీతంపేట రాజేంద్రనగర్‌లో గల జనసేన పార్టీ నగర కార్యాలయంలో జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. బాలల దినోత్సవం సందర్భంగా జనసేన 27వ వార్డు అధ్యక్షుడు గుండు సురేష్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ సౌత్ నియోజకవర్గ ఇన్‌చార్జి శివప్రసాద్, మహిళా కో ర్డినేటర్ త్రివేణి, అమరాపు దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు ఆటలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని టీచర్ మాలా బీబీ సూచించారు.


విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న నాయకులు


వాగ్దేవి పాఠశాలలో చిన్నారుల నృత్య ప్రదర్శన


మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో డ్యాన్సు చేస్తున్న విద్యార్థులు

ఆర్టీసీ ఈడీకి చైర్మన్ కొనకళ్ల పరామర్శ


బ్రహ్మానందరెడ్డిని పరామర్శిస్తున్న కొనకళ్ల నారాయణరావు, ఇతర అధికారులు

సీతమ్మధార : ప్రమాదానికి గురై ఎస్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆర్టీసీ జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేఎస్ బ్రహ్మానందరెడ్డిని గురువారం ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, పలువురు అధికారులు పరామర్శించారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆర్టీసీ చైర్మన్ వెంట జోన్–1 ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.విజయకుమార్, విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఐవీవీపీ దుర్గాప్రసాద్ ఇతర అధికారులు ఉన్నారు. బ్రహ్మానందరెడ్డికి అందిస్తున్న చికిత్సను ఆర్టీసీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ వాణి నీలిమ, కిమ్స్ వైద్యాధికారి డాక్టర్ విజయ పర్యవేక్షిస్తున్నారు.